ప్రజాశక్తి
ఆదివారం 18 మే 2025
8 పేజీలు
విశాఖపట్నం
అనకాపల్లి





గుంతల రహదారులు

- శారద, కొత్తూరు ఫ్లైఓవర్‌పై ప్రయాణ అవస్థలు
- డబ్బులు లేక చేయని నిర్వహణ
- బిల్లు రాక పనిచేయని కాంట్రాక్టర్



మరమ్మతులకు నోచని ఫ్లై ఓవర్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని అనకాపల్లి పట్టణంలో నిత్యమూ రద్దీగావున్న శారద నది, కొత్తూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ప్రయాణం చేయాలంటే భయపడేలా ఆ వంతెన రహదారులు తయారయ్యాయి. సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన సత్యదూరమని తేటతెల్లమైంది. కొత్తూరు ఫ్లై ఓవర్, శారద నదిపై నిర్మించిన ఫ్లై ఓవర్‌పై ఏర్పడిన గోతులు కొన్నేళ్లుగా కప్పలేదు. నిర్వహణ ఖర్చులు ఆర్ అండ్ బికి ప్రభుత్వం ఇవ్వకపోవడంతో చిన్నపాటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి.

ఈ బ్రిడ్జిలపై వెళ్లాలంటే ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి ఆరంభం నుంచి చివరి వరకు మధ్యమధ్యలో గుంతలు ఉన్నాయి.

గుంతలో పడ్డ వాహనాలు దెబ్బతింటున్నాయి. ద్విచక్రవాహన ప్రయాణికులు పడిపోతున్నారు. గోతులు పూడ్చకపోవడం ప్రమాదమని తెలిసినా ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖాధిపతులు పట్టించుకోవడంలేదు. రెండేళ్ల క్రితం కొత్తూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై బిటి లేయర్ పని చేయాల్సిన కాంట్రాక్టర్ వేరే చోట చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదని పని ప్రారంభించలేదు. ఆర్ అండ్ బి శాఖాధికారులు ఇచ్చిన నోటీసులపై కాంట్రాక్టర్ స్పందించి పనులు చేయడం లేదు. దాదాపు రెండు కోట్ల విలువైన పనులు చేయకపోవడంతో కొత్తూరు ఫ్లై ఓవర్‌పై ఏర్పడ్డ గోతులు తాత్కాలికంగా కూడా కప్పడంలేదు. కాంట్రాక్టర్ ఎంతకూ ముందుకురాకపోవడంతో చివరి సారిగా నోటీసు జారిచేస్తామని ఆర్ అండ్ బి ఇన్‌ఛార్జి ఇఇ విద్యాసాగర్ ప్రజాశక్తికి తెలిపారు. రెండు ఫ్లై ఓవర్ రహదారులు అత్యంత దయనీయంగా ఉన్న విషయం ఆయన దష్టికి తీసుకెళ్లగా రెండు, మూడు రోజుల్లో గోతులు పూడ్చే పని చేపడతామని ఆయన తెలిపారు.



గోతులు పడ్డ కొత్తూరు ఫ్లై ఓవర్

మెట్రో భూసేకరణపై కలెక్టర్ సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మెట్రోతో పాటు జిల్లాలో చేపట్టనున్న రైల్వే, హెచ్‌పిసిఎల్, ఇరిగేషన్, విద్యుత్, ఐఒసిఎల్, జాతీయ రహదారులు, అంతర్గత రోడ్ల విస్తరణ తదితర ప్రాజెక్టులపై జెసి, డిఆర్‌ఒలతో కలిసి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. డిపిఆర్‌కు అనుగుణంగా మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి తుది చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్దేశించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్ణీత కాలంలో అవసరమైన భూములను సేకరించి నివేదించాలన్నారు.

డిఆర్‌సి, దిశా అజెండా అంశాలపైనా సమీక్ష

కార్యాచరణకు అనుగుణంగా అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఇటీవల జరిగిన డిఆర్‌సి, దిశా సమావేశాల్లో చర్చించిన అంశాలపై కలెక్టరేట్‌లో శనివారం వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై ఆయా శాఖల ఆధ్వర్యాన సమీక్షించుకోవాలని, సమస్యలకు త్వరితగిన పరిష్కారాలు చూపాలని సూచించారు. ప్రాథమిక, ద్వితీయ, సేవా రంగాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రస్తావించిన అంశాలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు అధికంగా శ్రమించాలని నిర్దేశించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం చేపట్టాలన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నైపుణ్య శిక్షణ, సేవల విస్తృతిపై ప్రధానంగా దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సమావేశంలో భాగంగా ఆయా శాఖల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యల గురించి, సాధించిన ప్రగతి గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డిఆర్‌సి, దిశా సమావేశాలకు సంబంధించిన యాక్షన్ టేకెన్ రిపోర్టులను వారం రోజుల్లో అందజేయాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీశంకర్, ఆర్‌డిఒలు, ఎస్‌డిసిలు, ఇతర విభాగాల జిల్లాస్థాయి అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

జనావాసాల్లో సెల్ టవర్ పెట్టొద్దు
ఎమ్మెల్యేకు సిపిఎం నాయకుల వినతి

వార్త 2లో..

పోర్టుల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే
ఎజిఎం పర్యటన

వార్త 2లో..

గోవాడ సుగర్స్ రైతులు, కార్మికులకు
బకాయిలు చెల్లించాలని వినతి

వార్త 6లో..



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జెసి చైర్మన్ జగ్గునాయుడు

స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమ్మెకు సంఘీభావం

వార్తలు మెయిన్ 2లో..

జివిఎంసిలో రేపు పిజిఆర్‌ఎస్ రద్దు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 19వ తేదీ సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో పిజిఆర్‌ఎస్‌ను రద్దుచేస్తున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎమ్ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశం జరుగనున్న నేపథ్యంలో పోలీసులు చేపట్టబోయే రక్షణ చర్యల కారణంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జివిఎంసి ప్రధాన కార్యాలయంలో మాత్రమే రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం, జివిఎంసి అన్ని జోనల్ కార్యాలయాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యథాతథంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఆగ్నేయ రైల్వేలోని చక్రధర్‌పూర్ డివిజన్‌లో భద్రతా పనుల కోసం గమ్హారియా-సిని విభాగంలో మెగా బ్లాక్‌ల కారణంగా, 18005 హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 20, 27, జూన్ 3, 10, 17, 24 తేదీల్లో, 18006 జగదల్‌పూర్-హౌరా సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌ను మే 22, 29, జూన్ 6, 12, 19, 26 తేదీల్లో రద్దుచేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఈ నెల 19వ తేదీన చేపట్టే డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లు, తీసుకుంటున్న జాగ్రత్తలపై జివిఎంసి అధికారులకు విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూర్ అశోక్ పలు సూచనలు చేశారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశం కోసం చేస్తున్న ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా సర్వం సిద్ధం చేయాలని మయూర్ అశోక్ ఆదేశించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన ఎన్నిక ఏర్పాట్లుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మయూర్ అశోక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు జివిఎంసి డిప్యూటీ మేయర్ ఎన్నికను ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశం మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 11 గంటలలోగా తమ గుర్తింపు కార్డులతో హాజరు కావాలని కోరారు. ఇతరులకు అనుమతి లేదని తెలిపారు. సభ్యులు తమ మొబైల్ ఫోన్లలను ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించిన జివిఎంసి అధికారిక లైవ్ టెలీకాస్ట్ లింకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నిక సోమవారం జరుగబోతున్నందున ఆరోజు జివిఎంసిలో ఫ్రీ వెహికిల్ జోన్ అయినప్పటికీ సభ్యులు, అధికారుల వాహనాలను భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా ప్రధాన కార్యాలయం లోనికి అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.

జనావాసాల్లో సెల్ టవర్ పెట్టొద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 38వ వార్డు చెంగలరావుపేట పంజా జంక్షన్‌లో సెల్ టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు శనివారం ఆందోళన చేపట్టారు. ఆందోళన చేస్తున్న సమయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆ ప్రాంతంలో పర్యటించడంతో సెల్ టవర్ నిర్మాణ విషయాన్ని ఆయన దృష్టికి ప్రజలు, సిపిఎం నాయకులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సెల్ టవర్ నిర్మాణం చేస్తున్న ఇంటి వద్దకు వచ్చి స్థానికులతో మాట్లాడారు. అక్కడున్న ప్రజలంతా సెల్ టవర్ నిర్మాణం వల్ల అనేక ఇబ్బందులు వస్తాయని, రేడియేషన్ వల్ల తీవ్రమైన జబ్బులు వస్తాయని, అందుకే అభ్యంతరం చెబుతున్నామని తెలిపారు. 8 ఏళ్ల కిందట ఇదే ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణం చేపడితే ఇక్కడున్న ప్రజలు కోర్టులో కేసు వేసి అడ్డుకున్నారని ఎమ్మెల్యేకు సిపిఎం నాయకులు ఎం.సుబ్బారావు వివరించారు. ఇదే ప్రాంతంలో మరొక సెల్ టవర్‌కు జివిఎంసి అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయమై అధికారులతో మాట్లాడతానని, సెల్ టవర్ నిర్మాణం కాకుండా చూస్తానని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి కూడా ఇదే హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు, మత్స్య కార్మిక సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, సిపిఎం స్థానిక నాయకులు సంతోష్, పైడిశెట్టి, శ్రీను, ప్రసాద్,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సిపిఎం నాయకుల వినతి



ఎమ్మెల్యేకు సిపిఎం నాయకుల వినతి

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రెహమాన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మాజీ ఎమ్మెల్యే, ఉడా మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఎ.రెహమాన్ జన్మదిన వేడుకలు ఎవిఎన్ కళాశాల ఎదురుగా ఉన్న కమ్యూనిటీ హాల్లో శనివారం ఘనంగా జరిగాయి. డాక్టర్ రెహమాన్, డాక్టర్ షిరీన్ రెహ్మాన్ దంపతులు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ వేడుకల్లో ఆయన సన్నిహితులు అత్తిలి శంకర్రావు, గొలగాని రవీశ్వరరావు, మున్నం బాలాజీ, అబ్దుల్ చిన్న రెహమాన్, జఫ్రుల్లా ఎస్. అప్పారావు, పిల్లి రమణ, సింహాద్రి, ఎస్.రాము, యాళ్ల శ్రీనివాసరావు, విజయ, రుకియా భాను, శారద, లక్ష్మీదేవి బుదిల్ పార్థు, మేనేజర్ వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రెహమాన్ మాట్లాడుతూ, విశాఖపట్నం పాతబస్తీ ప్రజలతో తమకున్న అనుబంధంతో ఇక్కడ జన్మదిన వేడుకలు జరుపుకున్నట్లు తెలిపారు. తన జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న రెహమాన్

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన కానిస్టేబుల్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళను కాపాడిన ఎంవిపి కానిస్టేబుల్ బషీర్‌ను అధికారులు అభినందించారు. శుక్రవారం 35 ఏళ్ల మహిళ కనిపించడం లేదని ఎంవిపి పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు విచారణ చేస్తుండగా రాత్రి 11 గంటలకు కానిస్టేబుల్ బషీర్‌కు ఫోన్ వచ్చింది. పిఎమ్.పాలెం గ్యాస్ గోడౌన్ దగ్గర నిర్మాణంలో ఉన్న అయిదు అంతస్తుల భవనం పైనుండి ఒ మహిళ దూకేస్తానంటుందని ఫోన్‌లో వచ్చిన సమాచారాన్ని సిఐ మురళికి బషీర్ చెప్పారు. అందరికి సమాచారం ఇచ్చేలోగా ఆలస్యం కావొచ్చు, వెంటనే వెళ్లమని సిఐ ఆదేశించారు. సివిల్ డ్రెస్‌లో అక్కడకు వెళ్లిన బషీర్, ఒక మేస్త్రి సాయంతో ఆమెను కాపాడి బంధువులకు అప్పగించారు. తప్పిపోయిందన్న ఫిర్యాదులోని మహిళ ఈమే అని నిర్ధారించుకున్నారు. కమిషనర్ శంఖబ్రత బాగ్చి బషీర్‌ను అభినందించారు.

ప్రభుత్వ అనుమతులకు చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం దరఖాస్తు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం గత ఏడాదిలో స్థాపించిన చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం సంస్థ తన కార్యకలాపాలను విస్తృత పరచడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి అనుమతులు జారీ చేసేలా దరఖాస్తులు సమర్పించినట్లు ఫోరం అధ్యక్షులు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు ఎ.ప్రవీణ తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, కార్మిక సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతుల శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, హోం శాఖ, దేవాదాయ శాఖలతో పాటు మరిన్ని శాఖలకు ఈ దరఖాస్తులు సమర్పించినట్లు వివరించారు. ప్రధానంగా బాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, వారి హక్కుల పరిరక్షణలో భాగంగా నేరుగా వారితోనే మమేకమవుతూ సదస్సులు, సమావేశాలు, అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ అనుమతులు మంజూరయ్యాక సేవలు విస్తృతం చేయనున్నట్లు తెలిపారు.

స్కేట్ బోర్డింగ్ పార్క్ నిర్మాణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్డులోని విఎంఆర్‌డిఎ పార్కు ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్కేట్ బోర్డింగ్ పార్కు నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. 2026 నేషనల్ గేమ్స్ నాటికి పనులను పూర్తిచేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నామని వివరించారు. వుడా పార్క్‌లో ఉన్న స్కేటింగ్ రింక్‌ను పరిశీలించి, కోచ్‌లతో మాట్లాడి వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు గురించి ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వచ్చే ఏడాది నిర్వహించే జాతీయ ఆటల పోటీలకు వీలుగా రింక్ నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్షేత్ర స్థాయి పర్యటనలో ప్రధాన ఇంజినీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ భవానీ శంకర్, డిఎఫ్ఒ సుజాత శివానీ, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వినూత్న నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం ద్వారా గ్రామీణ ప్రాంత ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 20వ రోజైన శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం నృత్య భంగిమతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రజ్ఞ, కార్యదర్శి స్వాతి మాట్లాడుతూ, సమ్మెలో ఉన్న తాము 20 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ళ పూర్తి చేసుకున్న సిహెచ్ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనురాధ, శోభ, మోజెస్, సునీత, కల్పన, రూప పాల్గొన్నారు.

పోర్టుల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఎజిఎం పర్యటన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు, అదానీ గంగవరం పోర్టులో ఈస్ట్ కోస్ట్ రైల్వే అదనపు జనరల్ మేనేజర్ మోహన్ కుమార్ బెహెరా పర్యటించారు. మొదట విశాఖపట్నం ఒడరేవు ప్రాంతంలోని కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై సమీక్షించారు. విశాఖపట్నం పోర్టు ఆథారిటీ ఆపరేషనల్ హెడ్‌తో సమావేశమై పురోగతిని అంచనా వేయడం, సవాళ్లను పరిష్కరించడం, మెరుగైన రైల్వే కార్యకలాపాల పరిష్కారంపై చర్చించారు. కార్గో వాల్యూమ్‌లను పెంచడానికి రేక్‌లు పెంచాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న రైల్వే మౌలిక సదుపాయాల నవీకరణల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అదానీ గంగవరం పోర్టుకు చేరుకొని సిఇఒ అమిత్ మాలిక్, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. సామర్థ్యం పెంపుదల, రేక్ నిర్బంధం, కార్యాచరణ సామర్థ్యం, పరస్పర ఆసక్తి ఉన్న ఇతర కీలక అంశాలపై చర్చించారు. ఈ పర్యటనలో ఆయన వెంట వాల్తేర్ డిఆర్ఎం లలిత్ బోహ్రా, ఎడిఆర్ఎం ఆపరేషన్స్ మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కోఆర్డినేషన్) ఎకె.మోహరానా, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు.



పోర్టులో పర్యటిస్తున్న రైల్వే ఎజిఎం

డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన విశాఖపట్నం జిల్లాలో స్కిల్ హబ్ డాక్టర్ విఎస్.కృష్ణ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చాముండేశ్వరరావు సూచించారు. యువతీయువకులు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి 18 నుంచి 40 ఏళ్ళ వయసు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. 3 నెలలు ఉచితంగా సర్టిఫికెట్ ఆధారిత శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కల యువత స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ 9885694676 ను సంప్రదించాలని సూచించారు.

రక్తపోటుపై నిర్లక్ష్యం తగదు



డాక్టర్ అశ్విన్ కుమార్‌పాండా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రక్తపోటుపై నిర్లక్ష్యం తగదని మెడికవర్ హాస్పిటల్స్ కార్డియాలజిస్టు డాక్టర్ అశ్విన్ కుమార్ పాండా పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో దీర్ఘకాలిక సమస్యలు ఎక్కువై పోతున్నాయన్నారు. వాటిల్లో బీపీ కూడా ఒకటని తెలిపారు. బిపి ఒక్కసారి వస్తే జీవితంలో మళ్లీ తగ్గదని, కేవలం పెరగకుండా నియంత్రించుకుంటూ ఉండాలని పేర్కొన్నారు. అధిక బిపి వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదముందని తెలిపారు. బిపిని మందులతోనే కాకుండా సరైన ఆహారంతో కూడా నియంత్రించుకోవచ్చని చెప్పారు. హైబిపి కొన్ని లక్షణాలను చూపిస్తుందని, రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులకు ఎటువంటి లక్షణాలూ కనిపించవని వివరించారు. హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న వారు స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల రుగ్మతలు వంటి ఇతర ఆరోగ్య పరిస్థితుల ప్రమాదాన్ని కూడా ఎదుర్కొంటారని తెలిపారు. అధిక ఒత్తిడి రక్తపోటుకు దారితీయవచ్చన్నారు. తీవ్రమైన తలనొప్పి, ఛాతి నొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వికారం, వాంతులు అస్పష్టమైన దృష్టి ముక్కు రక్తస్రావం హైపర్ టెన్షన్ లక్షణాలని వివరించారు. ఆహారంలో ఉప్పును బాగా తగ్గించాలని, నడక, పరుగు, ఈత, డ్యాన్స్ లేదా బరువులు ఎత్తడం లాంటి వ్యాయామాలు చేయాలని సూచించారు.

కెనరా రోబెకో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఈక్విటీ అండ్ ఈక్విటీ సంబంధిత రుణం, మనీ మార్కెట్, గోల్డ్, సిల్వర్ ఇటిఎఫ్‌లలో పెట్టుబడి పెట్టే ఓపెన్-ఎండ్ పథకం అయిన కెనరా రోబెకో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను కెనరా బ్యాంకు మార్కెట్లో విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధి రజనీష్ నరుల తెలిపారు. బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇది మార్కెట్ అవసరాలను తీర్చడానికి రూపొందించిన నూతన పథకమని అన్నారు. ఈ ఫండ్ దీర్ఘకాలిక మూలధన పెరుగుదలను అందించడం లక్ష్యంగా ప్రారంభించామని తెలిపారు. ఈ ఫండ్ పెట్టుబడిదారులకు వ్యూహాత్మక ప్రయోజనాన్ని అందిస్తుందని, ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి సహకరిస్తుందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో సంస్థ ఈక్విటీ హెడ్ శ్రీదత్ త పాల్గొన్నారు.

ఈసెట్‌లో రిషి కమల్‌కు 8వ ర్యాంక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్శిటీ నిర్వహించిన ఎపి రాష్ట్ర ఈసెట్ ఎంట్రన్స్ పరీక్షల్లో విశాఖకు చెందిన ఇల్లపు రిషి కమల్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ 8వ ర్యాంక్ సాధించారు. పాత నగరం ఇందిర ప్రియదర్శిని స్టేడియం పాత బస్టాండ్ సమీపంలోని ప్రసాద్ గార్డెన్స్‌లో రిషి కమల్ నివాసం ఉంటున్నారు. బిసి సామాజిక తరగతికి చెందిన ఇల్లపు శ్రీనివాసరావు, లక్ష్మి దంపతుల కుమారుడైన ఇల్లపు రిషి కమల్ ఈ ర్యాంక్ పొందడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



నేడు బీచ్ రోడ్డులో తిరంగా యాత్ర

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్‌లోని పార్క్ హోటల్ నుండి కాళీమాత టెంపుల్ వరకు ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని బిజెపి జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ఎన్.పరశురామ్ రాజు తెలిపారు. కూటమి పార్టీలు కలిపి ఈ తిరంగా యాత్రను నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ యాత్రకు ముఖ్యఅతిథిగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ హాజరవుతారని తెలిపారు.


బిఎన్ఆర్ నగర్‌లో సమస్యల కొలువు!

- కనీస సౌకర్యాలు లేక జనం అవస్థలు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని వైనం
- ఆందోళన, ఆవేదన చెందుతున్న స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి పదో వార్డు, తోటగరువు, బిఎన్ఆర్‌నగర్ సమస్యల వలయంలో కొట్టామిట్టాడుతోంది. కాలనీ ఏర్పాటై 15ఏళ్లు కావస్తున్నా ఇక్కడ కనీస మౌలిక వసతులు కానరావు. దీనిపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా కొండవాలు ప్రాంతంలో బిఎన్ఆర్‌నగర్ ఏర్పడింది. ఇక్కడ సుమారు 600 నిరుపేద కుటుంబాలు నివాసముంటున్నాయి. . రోజు వారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరంతా ఇంటి అద్దెలు కట్టలేని పరిస్థితుల్లో గత్యంతరం లేక 15 ఏళ్ల క్రితం ఇక్కడ ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. ఇన్నేళ్లయినా వీరికి కనీసం తాగునీరు, ఇతర సౌకర్యాల కల్పనకు అటు అధికారులుగానీ, నేతలుగానీ చర్యలు చేపట్టలేదని వాపోతున్నారు.

వర్షా కాలంలో ఎక్కడ కొండ చరియలు విరిగి పడి తమ ఇళ్ల మీద పడతాయోనని భయం గుప్పెట్లో పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు.కాలనీలో యుజిడి సౌకర్యం లేక పోవడంతో మురుగు సమస్యతో ఇబ్బందులు పెడుతోంది. వీధిలైట్లు నిర్వాహణ అంతంతమాత్రమే కావడంతో చీకటి పడ్డాక కొండ మీదకు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలో కనీస సౌకర్యాలు లేకున్నా జివిఎంసి యంత్రాంగం అధిక మొత్తంలో ఇంటి పన్నులను ముక్కుపిండి వసూలు చేస్తోందని, విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు కొండపై ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని, రిటైనింగ్ వాల్స్, మెట్ల మార్గం నిర్మించాలని అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, బ్రిడ్జి నిర్మించాలని, ఎంతో కాలంగా మొరపెట్టుకున్నా కనీసం స్పందించే దిక్కు లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలని, బిఎన్ఆర్ నగర్‌లో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.



కొండవాలులో ఉన్న బిఎన్ఆర్‌నగర్

నేరాలు ఘోరాలు

నర్సీపట్నంలో చోరీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ప్రాంతంలో ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. నర్సీపట్నం మున్సిపాలిటీ శారద నగర్‌లో శుక్రవారం రాత్రి ఓ ఇంటిలో బంగారాన్ని దొంగలు అపహరించారు. టౌన్ సిఐ గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం.. శారద నగర్‌లో వెంకటలక్ష్మి అనే వృద్ధురాలు ఇంట్లో ఒక్కరే నివసిస్తుంది. ఇంటి వెనుక భాగం నుండి ఇద్దరు అగంతకులు ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో బంగారు గొలుసు, చేతికి ఉన్న 8 గాజులను దోచుకున్నారు. ఇంటి చుట్టూ ఉన్న సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశామని టౌన్ సిఐ గోవిందరావు చెప్పారు. దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి -ఆనందపురం : స్థానిక మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ బి లక్ష్మీపతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు ఎంతో అవసరం అన్నారు. ప్రతిఒక్కరూ వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులు ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలను తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఎండల్లో తిరగరాదన్నారు. కార్యక్రమంలో ఎపిఎం ఎఫ్‌పిఒ వల్లయ్య, ఎపిఎం హెచ్‌డి రేణుక, ఎపిఎంలు ఆదినారాయణ, ధనలక్ష్మి, సిసిలు, డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.

20న ఉక్కు సమ్మెను జయప్రదం చేయాలి



దీక్షల్లో కూర్చున్న స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 20న చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎన్.రామారావు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 1556వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు, కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎన్.రామారావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై యాజమాన్యం తన మొండివైఖరిని నిలువరించే విధంగా సమ్మె జరగాలన్నారు. ప్లాంట్‌కు లాభాలు వస్తున్నప్పటికీ కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం యాజమాన్య దుర్మార్గానికి నిదర్శనమన్నారు. ఇదే పద్ధతిని యాజమాన్యం అనుసరిస్తే పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు పుల్లారావు, అప్పలరాజు, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, కృష్ణారావు, కార్మికులు పాల్గొన్నారు.

పెన్‌స్టేట్ వర్సిటితో గీతం ఎంఒయు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : అమెరికాకు చెందిన ప్రముఖ వర్సిటీ పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పెన్‌స్టేట్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ డేవిడ్ ఎమ్. కెల్లిజో పెరీజ్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వహీద్ మోటెవెల్లి శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్మర్ ప్రోవైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, అకడమిక్ ఎఫైర్స్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ రాధికతో సమావేశమై ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుని అవగాహనా పత్రాలను మార్చుకున్నారు. పెన్ స్టేట్ విశ్వవిద్యాలయంతో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విభాగాలలో ఉమ్మడిగా పిజి, యుజి కోర్సులను అందించడానికి ఈ అవగాహన ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. గీతం విద్యార్థులకు పెన్ స్టేట్ వర్సిటీ ప్రతిభ స్కాలర్ షిప్‌లను అందించాలని కోరారు.

గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలను అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామన్నారు. బోధనతో పాటు పరిశోధన అంశాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నామని, రూ. వంద కోట్లకు పైగా వ్యయంతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేశామని వెల్లడించారు. గీతంలో ప్రస్తుతం 300 పరిశోధనా ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయని, పరిశ్రమల సహకారంతో పలు కోర్సులను నిర్వహిస్తోందన్నారు. పలు అంతర్జాతీయ విద్యా సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. అమెరికాలోని ప్రస్తుత ప్రభుత్వ ఆలోచనలు భారతీయ విద్యార్థుల పట్ల ఏవిధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గీతం వర్సిటీ మూర్తి ప్రయోగశాలలను పెన్‌స్టేట్ వర్సిటీ ఛాన్సలర్ సందర్శించి అభినందించారు. మూర్తి ప్రయోగశాలలలో జరుగుతున్న అధ్యయనాలను గీతం విశిష్ట ప్రొఫెసర్ జగదీష్ భరత్ వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్, సిఎస్ఇ.విభాగం అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ శాంతి, జిసిజిసి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్ పాల్గొన్నారు.

మేయర్ పీలాకు ఘన సత్కారం



పీలాను సత్కరిస్తున్న వుడా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- పెందుర్తి: గ్రేటర్ విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావును, జివిఎంసి 97వ వార్డు వుడా కాలనీ అసోసియేషన్ సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట రాము ఆధ్వర్యంలో పెందుర్తిలోని పీలా శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వుడా కాలనీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. పలు సమస్యలను మేయర్ దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు.

ఆరు నెలల్లో ఫుట్ ఓవర్ నిర్మాణం



మ్యాప్‌లతో స్థలపరిశీలన చేస్తున్న రవితేజ

ప్రజాశక్తి-మధురవాడ : చంద్రంపాలెం హైస్కూల్ ఎదురుగా జాతీయరహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.23కోట్ల నిధులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో మంజూరయ్యాయని గంటా తనయుడు, టిడిపి యువనేత గంటా రవితేజ తెలిపారు. శనివారం ప్రతిపాదిత ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిడ్జి పనులకు ఒకటి రెండు నెలల్లోనే టెండర్లు ఖరారుచేసి, ఆరునెలల్లో పూర్తిచేస్తామన్నారు.

ఎమ్మెల్యే గంటా చొరవతో చంద్రపాలెం హైస్కూల్ విద్యార్థులతోపాటు ఇక్కడి ప్రయాణికులకు ప్రమాదకష్టాల నుంచి విముక్తి లభించనుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకటరావు, గరే గురునాథం పాల్గొన్నారు.

శిర్లపాలెం హైస్కూల్ సమస్యల పరిష్కారానికి కృషి

ఆనందపురం: మండలంలోని శిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి యువ నాయకుడు గంట రవితేజ అన్నారు. శనివారం పాఠశాలను సందర్శించగా, స్థానిక హెచ్ఎం శారద పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. పాఠశాల ప్రహరీ, అదనపు తరగతి గదులు, కంప్యూటరు ల్యాబ్,డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనశాలను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం, దాతలు సహకారంతో వాటిని పూర్తిచేస్తామన్నారు. మురుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఇఒ కె.గంగరాజు, కూటమి నేతలు తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి. నాయుడు, కోరాడ గౌరీనాయుడు, దాతలు వెంకటరావు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుందరంగా చెరువుల అభివృద్ధికి కృషి

ఆనందపురం పూర్వవాణి చెరువు, దొంతల వారి కల్లాలు మర్రిచెరువులను గంటా రవితేజ సందర్శించారు. చెరువు గట్టు చుట్టూ పూలమొక్కలు, వాకింగ్‌ట్రాక్, చెరువు మధ్యలో బుద్ధుని విగ్రహం ఏర్పాటుతో ఆయా చెరువులను సుందరంగా తీర్చిదిద్దాలని స్థానిక నేతలు కర్రోతు సత్యనారాయణ తదితరులు రవితేజకు వివరించారు. చెరువు గర్భంలోని శ్మశానవాటికను వేరేచోట పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. బోయపాలెం హైస్కూల్‌లో విద్యార్థుల డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని, హెచ్ఎం కొండబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ గ్రామ యువకులు చల్ల రామిరెడ్డి, తదితరులు రవితేజకు విన్నవించారు.కార్యక్రమంలో నాయకులు లంక నర్సింగరావు, కొట్యాడ రెడ్డిబాబు, కొట్యాడ లక్ష్మణమూర్తి ,పాల్గొన్నారు

'మినీ గోకులం' షెడ్ల బిల్లులు చెల్లించరూ?

ప్రజాశక్తి-భీమునిపట్నం : మినీ గోకులం పథకం కింద పశువులకు నిర్మించిన షెడ్లకు బిల్లులు చెల్లింపునకు నిధులు మంజూరు చేయాలని టిడిపి మండలస్థాయి నాయకులు మజ్జి వెంకట రావు, గాడు తాతినాయుడు, నీలాపు సూర్య నారాయణ కోరారు. శనివారం విశాఖ డ్వామా పీడీ కార్యాలయంలోసంబంధిత అధికారికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అప్పులు చేసి షెడ్లు నిర్మించి నెలల గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాడిరైతుల ఆర్థిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు.

ఉక్కు యాజమాన్య వైఖరిపై సమ్మెతో ప్రతిఘటన

20న విశాఖ స్టీల్‌ప్లాంట్ సమ్మెకు అఖిలపక్ష కార్మికుల సమాయత్తం



మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం

ప్రజాశక్తి-ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు సమ్మెతో ప్రతిఘటిస్తామని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. శనివారం స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న ఉక్కు సమ్మె ప్రాధాన్యతను వివరించారు. ధర్నాకు ముందు డిమాండ్ బ్యాడ్జీలను, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ, గడచిన మూడు నెలలుగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ కార్మికులకు చెల్లించాల్సిన బకాయి, రెగ్యులర్ వేతనాలను సక్రమంగా చెల్లించడం లేదన్నారు. హెచ్‌ఆర్‌ఎ పునరుద్ధరణ హామీ నెరవేర్చకుండా యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ఎక్కడా లేనివిధంగా ఉక్కునగరంలో కరెంటు చార్జీలను పెంచి కార్మికులను మరింత ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికవర్గం విభాగాల వారీగా నిర్ణయించుకుని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా ఉక్కు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇంటక్ జాతీయ కార్యవర్గ సభ్యులు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ నిర్వాసితుల త్యాగాన్ని అపహస్యం చేసేవిధంగా నేడు ఉక్కు యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులను అప్రజాస్వామికంగా తొలగిస్తోందని మండిపడ్డారు. యాజమాన్యం చర్యలను సమ్మెతో ప్రతిఘటిస్తామనివాచ్చరించారు.

78వ వార్డు సిపిఎం కార్పొరేటర్, జివిఎంసిలో ఆపార్టీ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తన తాబేదారులకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన దుర్మార్గమన్నారు. ప్యాకేజీ పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోసం చేస్తున్న కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి జరిగితే ప్రజలకు అందుబాటు ధరలో స్టీల్ లభిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం గనులు కేటాయించేలా కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు.

స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు కెఎస్‌ఎన్ రావు, పివి రమణమూర్తి, యు.రామస్వామి, జి గణపతి రెడ్డి, డివి రమణారెడ్డి, రామ్‌కుమార్ మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం వైఖరికి సమ్మెతో గుణపాఠం చెపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ ఎస్‌సి, ఎస్‌టి యూనియన్ అధ్యక్షులు బి తౌడన్న, ఒబిసి అధ్యక్షులు బి అప్పారావు, స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పి శ్రీనివాసరాజు, పుల్లారావు, కె సత్యనారాయణ, గంగాధర్, వి ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, ముని వెంకటరమణ, యు వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎపిఇపిడిసిఎల్‌తో సిపిఆర్ ఎంఒయు



ఒప్పంద ప్రతాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ డేటా ఆధారిత నిర్ణయాలను బలోపేతం చేసుకొనేందుకు సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ (సిపిఆర్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆధ్వర్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సిజిఎం పి శ్రీనివాస్, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ ప్రెసిడెంట్ చొక్కాకుల శ్రీనివాస్ ఎంఒయుపై సంతకాలు చేసారు.
ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, మున్సిపల్ శాఖ వంటి అనేక శాఖలతో కలిసి పనిచేసిన అనుభవంతో ఇకపై ఎపిఇపిడిసిఎల్‌తో పని చేయనుంది. యాక్సిస్ బ్యాంక్ మాజీ చీఫ్ ఎకనమిస్ట్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ ప్రస్తుత సభ్యుడు శౌగత భట్టాచార్య పర్యవేక్షణలో సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థ ఎపిఇపిడిసిఎల్‌కు సహకరించనుంది. విద్యుత్ పంపిణీ సామర్థ్యవృద్ధి, ఆదాయవృద్ధే లక్ష్యంగా సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థ ఎపిఇపిడిసిఎల్‌కు డేటా ఆధారిత విశ్లేషణలు చేయడంతో పాటు సంస్థ సిబ్బందికి అధ్యయనాలు, సూచనలు చేయనుంది. ఎపిఇపిడిసిఎల్‌లో ఏర్పాటు చేసిన డేటా అనలిటిక్ యూనిట్ (డిఎయు)ను అభివృద్ధి పరచడం ద్వారా సంస్థ అంతర్గత వ్యవస్థ సామర్థ్యాలను పెంచడం, బిల్లింగ్ వ్యవస్థలోని రెవిన్యూ నష్టాలను తగ్గించడం, క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి డేటా విశ్లేషణలు, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడంలో బలోపేతం చేయడంపై సిపిఆర్ సహకరిస్తుంది.

క్షతగాత్రుల వైద్యానికి హోంమంత్రి చొరవ

ప్రజాశక్తి- సీతమ్మధార : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వైద్యానికి ఎపి హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత చూపిన చొరవ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. విశాఖనగరంలోని తాడిచెట్లపాలెం జంక్షన్ దగ్గర శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అచేతనావస్థలో పడిఉన్న యువకుడిని గమనించిన అదే సమయంలో అటుగా ఎయిర్‌పోర్టుకు వెళుతున్న ఎపి హోంశాఖ మంత్రి అనిత చలించిపోయారు తన కాన్వాయ్‌ను ప్రమాదస్థలం వద్ద ఆపించి, క్షతగాత్రుని వద్దకు తానే స్వయంగా వెళ్లి సపర్యలు చేశారు. ప్రమాదంలో గాయాలపాలైన ఓ వృద్ధురాలితో సహా మిగిలిన వారికీ ఏం కాదమ్మా.. అంటూ ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం కోసం సమీప హాస్పిటల్‌కు తరలించాలని పోలీసులను ఆదేశించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



ఆర్‌ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ సిఎస్‌ఆర్ నిధులతో జివిఎంసి 58వవార్డు శ్రీహరిపురం పిలకలవానిపాలెంలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని, శ్రీహరిపురం శ్రీరామ్ నగర్‌లో ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను, శ్రీరామ్‌నగర్‌లో కమ్యూనిటీ ఓపెన్ జిమ్‌ను విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు శనివారం ప్రారంభించారుఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల కొరకు ఉపయోగపడే కార్యక్రమాలను కోరమండల్ కంపెనీ సిఎస్‌ఆర్ నిధులతో చేపట్టడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో కోరమండల్ యాజమాన్య ప్రతినిధులు, టిడిపి జనసేన బిజెపి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.!

జూ పార్కులో కొత్త నేస్తాలు!

కూనలకు జన్మనిచ్చిన అరుదైన జంతు జాతులు : సంతానోత్పత్తి కేంద్రంగా జూ



కొత్తగా జన్మించిన తోడేలు, నక్క, లేమూర్ కూనలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో అరుదైన జాతులకు చెందిన జంతువులు కూనలకు జన్మ నిచ్చాయి. ఒక తోడేలు పిల్ల, ఒక బెంగాల్ జాతికి చెందిన ఒక నక్క పిల్ల, మడగాస్కర్‌కు చెందిన లేమూర్ పిల్లలు కొత్తగా జన్మించాయి. అంతరించి పోతున్న షెడ్యూల్-1 జాతికి చెందిన తోడేలు ఒక పిల్లకు జన్మనివ్వడం సంతోషంగా ఉందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇటీవల కాలంలో జూపార్కులో వివిధ జాతుల జంతువులు పిల్లలను కంటున్నాయని, జూ పార్కులో జంతువుల సంతోనోత్పత్తికి, వాటి పరిరక్షణ వైపు ఒక ప్రధాన అడుగు పడిందన్నారు. దీనికోసం జూ అధికారులు, పశువైద్య బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. దీని వెనుక జూ సిబ్బంది అంకితభావంతో కూడిన కృషి, జంతు సంరక్షణ, సంతానోత్పత్తి కార్యక్రమంలో వారి నైపుణ్యం ఉందన్నారు. అందమైన కొత్త జంతువులను త్వరలో చూడవచ్చున్నారు.

నిరుపయోగంగా బిఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్

- నిర్మించి ఏడాదైనా వినియోగంలోకి తేని వైనం
- ఆవేదన చెందుతున్న ఇచ్ఛాపురం గిరిజనులు



ఇచ్ఛాపురంలోని బిఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్

ప్రజాశక్తి -ఆనందపురం: మండలం కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం గ్రామానికి కమ్యూనికేషన్ వ్యవస్థ లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 55 కుటుంబాలకు చెందిన సుమారు 300మంది జనాభా నివసిస్తున్నారు. వీరంతా ఎస్‌టి మన్యం దొరల తెగలకు చెందినవారు. ఈ ప్రాంతం గూగుల్ మ్యాప్‌లో లేకపోవడంతో ఎటువంటి సేవలకు నోచుకోలేక పోతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గత వైసిపి హయాంలో ఈ గ్రామానికి సమాచార సంబంధాలను నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో బిఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ గ్రామ గిరిజనులు ఎంతో ఆనందం వ్యక్తం చేసినా, అది ఎన్నాళ్లో నిలవలేదు. ప్రభుత్వం మారిన తర్వాత నేటికీ బిఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్‌కు పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో సిగ్నల్ లేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. అత్యవసర సమయంలో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి, పింఛన్లు, రేషన్, ఇతరత్రా ప్రభుత్వ ఆన్‌లైన్ సేవలకు వీలులేని పరిస్థితి నెలకొంది. గూగుల్ మ్యాప్‌లో ఇచ్ఛాపురం లేకపోవడంతో ఆన్‌లైన్ సేవలకు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి, బిఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని ఇచ్ఛాపురం గ్రామస్తులు కోరుతున్నారు

న్యాయవాది కరుణకు సతీ వియోగం



న్యాయవాది శైలజ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -మాధవధార : ప్రముఖ న్యాయవాది సనపల కరుణ సతీమణి న్యాయవాది సనపల శైలజ శనివారం అనారోగ్య కారణంగా ఆమె ఇంటి వద్ద మృతి చెందారు. ఈ సందర్భంగా మాధవధార గ్రామ ప్రజలు, చైతన్య కళాసాగర్ సభ్యులు ఆమెకు ఘననివాళులు అర్పించారు. పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు ఉచిత న్యాయ సలహాలు అందించడమే కాకుండా న్యాయపరమైన కేసులను ఉచితంగా శైలజ వాదించేవారు. శనివారం మాధవధార శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్ గోపాలరావు, కో కన్వీనర్ పప్పల రామచంద్రరావు, న్యాయవాదులు, మాధవధార ప్రజలు పాల్గొని నివాళులు అర్పించారు.

పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు



నీటితొట్టెలను ప్రారంభిస్తున్న వెటర్నరీ జెడి డాక్టర్ కరుణాకర్

ప్రజాశక్తి -ఆనందపురం : వేసవిలో పాడి పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు ఎంతగానో దోహదపడతాయని పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎన్ కరుణాకరరావు అన్నారు. శనివారం మండలంలోని కుసులవాడ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన పశువుల నీటితొట్టెలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి నిధులతో పలు గ్రామాల్లో పశువులకు నీటి తొట్టెలు నిర్మించామని, పాడిరైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో పశువులను సరైన సంరక్షణలో పెంచాలన్నారు. బోని గ్రామంలో పశువుల రక్తనమూనాలను సేకరించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎం. చంద్రశేఖర్, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు (విజయవాడ), డాక్టర్ సజ్జ శ్రీనువాసరావు,, ఉప సంచాలకులు డాక్టర్ పి. మోహినీకుమారి, శొంఠ్యాం పశు వైద్యాధికారి డాక్టర్ కన్నయ్యనాయుడు . కుసులవాడ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజీ పాల్గొన్నారు

కూటమిలో లుకలుకలు..



◆ బయటకు కలిసి పని చేస్తున్నా అంతర్గతంగా విభేధాలు

◆ బండారు గ్రూపును పూర్తిగా పక్కన పెట్టేసిన వైనం

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండలంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. పొత్తు ధర్మం ప్రకారం అందరూ కలిసి పని చేస్తున్నట్లు బయటకు కనిపిస్తున్నా... అంతర్గతంగా వారి మధ్య విబేధాలు ఉన్నట్లు బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు మాజీ మంత్రి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి గ్రూపును పూర్తిగా పక్కన పెట్టారన్న విమర్శలున్నాయి.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నది. మండలంలో కూటమి నాయకుల్లో ఆధిపత్య పోరు చాప కింద నీరులా పాకుతుంది. ఇప్పటికే టీడీపీలో రెండు వర్గాలుగా ఉన్నాయి. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి గ్రూపును పూర్తిగా పక్కన పెట్టగా, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ గ్రూపునకు జనసేన నాయకులకు మధ్య నివురుకప్పిన నిప్పులా విభేదాలు ఉన్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆర్థికపరమైన కారణాలే ఇందుకు కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఏదైనా కార్యక్రమంలో భాగంగా పర్యటించిన రెండు మూడు రోజుల్లోనే టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గండి బాబ్జి ఈ మండంలో పర్యటన ఉంటుంది. తమ కేడర్‌ను కాపాడుకునేందుకే బాబ్జి ఇలా పర్యటనలు చేస్తున్నారని కార్యకర్తలు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో గండి బాబ్జి వర్గం పూర్తిగా కూటమి తరఫున తిరిగి జనసేన అభ్యర్థి పంచకర్ల గెలుపునకు కషి చేశారన్న నానుడి ప్రజల్లో ఉంది. అయినా కూడా పంచకర్ల, బాబ్జీ ఇద్దరు నాయకులు కలిసి మండలంలో పర్యటించిన దాఖలాలు ఇప్పటి వరకు కనిపించలేదు. కూటమిలో మండలస్థాయి నాయకుల్లో కూడా ఇదే వైఖరి కనిపిస్తోంది. జనసేన, టిడిపి నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది.

రావాడ వ్యవహారంతో రచ్చ

రావాడ గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు వ్యవహార శైలి కూటమిలో రచ్చకు దారితీసింది. ఆయన తీరు వల్ల కొంతమంది కూటమి నాయకులు ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల రావాడ పంచాయతీ పరిధిలో కిశోర బాలికల కార్యక్రమానికి సంబంధిత అంగన్వాడీ టీచర్ స్థానిక సర్పంచ్ అయిన మోటూరు సన్యాసినాయుడుకు ఆహ్వానం ఇచ్చి, ఆయన సూచించిన సమయానికి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నతో పాటు కూటమి నాయకులు, అధికారులు, కిశోర బాలికలు వచ్చారు. కాని సర్పంచ్ ఆ సమయానికి రాలేదు. దీంతో కార్యక్రమాన్ని కొనసాగించారు. దీనికి ఆగ్రహించిన సర్పంచ్ సబ్బవరం ఐసిడిఎస్ పిఒ చేత సంబంధిత అంగన్వాడీ టీచర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయించి, ఆ నోటీసును వాట్సాప్ వంటి సోషల్ మీడియాలో వైరల్ చేయించారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపించాయి. అయితే అంగన్వాడీ టీచర్ తప్పులేదని తేలడడంతో షోకాజ్ నోటీసు వెనక్కి తీసుకున్నా.. టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు మధ్య ఉన్న అంతర్గత విభేదాలే దీనికి కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రావాడ పంచాయతీలో నాయకుల వ్యవహారశైలితో అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు సైతం వెనకడుగు వేయడం ఇక్కడ కొసమెరుపు.



శివ దంపతులను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా శివ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర గవరకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ పుట్టినరోజు వేడుకలు శనివారం ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఈ పుట్టినరోజు వేడుకల్లో వైసిపి నాయకులు మలసాల రమణారావు, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ రామ్మూర్తి, భీశెట్టి వరాహ సత్యవతి, పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, కొణతాల మురళీకృష్ణ , గొల్లవెల్లి శ్రీను, కే.ఎం నాయుడు, జాజుల రమేష్, రాఘవ, కడిమిశెట్టి సతీష్, మొగలపల్లి సుబ్బారావు ఎల్లపు గాంధీ, గైపూర్ రాజు, రాయవరపు జోగిరాజు, వేగి త్రినాథ్, పెంటకోట శ్రీను, నడిశెట్టి శెట్టి మధు, బుద్ధరాజు మద్దాల సురేష్, పిల్ల రాజు, హైమావతి, పద్మ, శ్రీధరాల మనోజ్ మున్నూరు శ్రీను, ఆడారి శ్రీను వాసుపల్లి తాతీలు, ఆడారి బుచ్చి రాము, శ్యాము, కుంకు శ్రీరామ్మూర్తి, చంటి, జ్ఞానదీప్, దాడి నారాయణరావు, పోలమరి శెట్టి గోపి, బొడ్డేడ మోహన మద్దాల శివ నాయుడు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్ఐ శేషగిరికి అతి ఉత్కృష్ట మెడల్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా డీసీఆర్‌బీలో అదనపు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శేషగిరికి కేంద్ర ప్రభుత్వం నుంచి "అతి ఉత్కృష్ట మెడల్" లభించింది. ఈ అవార్డు ఉమ్మడి విశాఖ జిల్లా పోలీస్ స్టేషన్లలో ఆయన అందించిన సుదీర్ఘ, నిష్కాభరిత సేవలకు గుర్తింపుగా ఇవ్వబడింది. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శేషగిరికి పతకాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ లక్ష్మణ మూర్తి పాల్గొన్నారు. పోలీసు అధికారులు, జిల్లా పోలీసు అధికారుల సంఘ సభ్యులు శేషగిరి కి హదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



శేషగిరికి మెడల్ పెడుతున్న ఎస్పి

టిడిపి పట్టణ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-యలమంచిలి : తెలుగుదేశం పార్టీ యలమంచిలి పట్టణ కార్యవర్గ ఎన్నికలు శనివారం జరిగాయి. ఉత్కంఠ భరితంగా పోటీ ఏర్పడగా చివరికి జిల్లా అధ్యక్షులు తాతయ్యబాబు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావుల చొరవతో ఏకగ్రీవమైంది. యలమంచిల పట్టణ అధ్యక్షులుగా గొర్లె నానాజీ, కార్యదర్శిగా ఆడారి ఆదిమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీనియర్‌నేత చలపతిరావు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచీ పనిచేసిన కార్యకర్తల్ని గుర్తించడంలో తెలుగుదేశం ఎల్లప్పుడూ ముందుంటుందని కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. యలమంచిలి మెయిన్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ కార్యకర్తల అభిప్రాయాలు సేకరించి తుది నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

చలపతిరావు ప్రకటనను ఖండించిన ఆడారి ఆదిమూర్తి

తనను యలమంచిలి పట్టణ కార్యదర్శిగా ఎన్నికైనట్లు ప్రకటించడాన్ని ఆడారి ఆదిమూర్తి ఖండించారు. ఎన్నికైనట్లు ప్రకటించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ కార్యదర్శి పదవిని తాను చేపట్టడం లేదని, పార్టీ వివరణ అడిగితే తాను పదవి ఎందుకు చేపట్టడంలేదో వివరిస్తానని మాత్రం చెప్పారు.



నూతన కార్యవర్గంతో చలపతిరావు,తాతయ్యబాబు తదితరులు



కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఈజెడ్ పరిశ్రమల కార్మికులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సవరించి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. ఇవి అమలైతే కార్మికులు యజమానులకు కట్టుబానిసలు అవుతారని పేర్కొన్నారు. పలు ఆర్థికపరమైన సమస్యలు ఎదురవుతాయన్నారు. ప్రతి కార్మికునికి రూ.26వేలు చొప్పున వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రభాకర్, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

'సిరివెన్నెల' 70వ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి 70 జయంతి కార్యక్రమం పోస్టర్‌ను స్థానిక జనసేన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈనెల 20న మంగళవారం సాయంత్రం 5 గంటలకు అనకాపల్లి పట్టణంలోని సత్యా గ్రాండ్‌లో సీతారాం శాస్త్రి 70వ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, పీల నాగ శ్రీను, గంటి రవి కుమార్, కొడుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

బాలిక కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లిలో కలకలం రేపిన బాలిక కిడ్నాప్ కేస్ కథ సుఖాంతమైంది. రెండు రోజులుగా అందర్నీ టెన్షన్‌కు గురి చేసిన ఉదంతానికి తెరపడింది. రెండు రోజుల్లోనే పోలీసులు కేసును ఛేదించి బాలికను రక్షించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

అనకాపల్లి లోకవారి వీధిలో నివసిస్తున్న కోలు లలిత, భర్త భీశెట్టి హరీష్ దంపతుల చిన్న కుమార్తె (నాలుగేళ్లు) రోహిత ఈ నెల 14 నుండి కనిపించలేదని నెల 15వ తేదీన టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోలీస్ సిబ్బంది సంఘటన స్థలమైన లోకవారి వీధిని సందర్శించి, పరిసర ప్రాంతాలలో నివాసితులను విచారించారు. బాలిక ఫోటోలను సేకరించి, బాలికకు సంబంధించిన వివరాలతో లుక్ అవుట్ నోటీసులు తయారు చేసి వాట్సాప్ గ్రూపులైన జిఎస్ఎంకే, జిల్లా పోలీస్ అధికారుల గ్రూపుల్లో వాటిని షేర్ చేశారు. బాలిక కనిపించకుండా పోయిన వార్తను అన్ని పత్రికలలో ప్రచురణ కూడా జరిగింది. బాలికను గుర్తించేందుకు 6 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. స్థానిక పెరుగుబజార్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించగా, ఈ నెల 14న సాయంత్రం 5.50 గంటల సమయంలో పెరుగుబజార్ వద్ద ఒక మహిళ బాలికని తీసుకొని ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. నిందితురాలు టౌంటోని లక్ష్మి గాజువాక పెదగంట్యాడ నివాసిగా గుర్తించారు. బోనాలా దేవిని కలవడానికి అనకాపల్లికి వస్తుండగా, జలగలమదుం జంక్షన్ వద్ద అనకాపల్లి టౌన్ పోలీసులు నిందితురాలు లక్ష్మిని అరెస్టు చేశారు. ఆమెను విచారించారు. విచారణలో ఎ1 నిందితురాలు టి.లక్ష్మి, ఎ2 బి.దేవి బాలికను ఈ నెల 14న కిడ్నాప్ చేసి, గాజువాక, ఇతర ప్రాంతాలకు తరలించి, ఆమెను విక్రయించడం, బానిసగా ఉపయోగించేందుకు ప్రయత్నించినట్లు వారు అంగీకరించారు. ఈ కేసుపై మిగతా విచారణ కొనసాగుతుంది. కిడ్నాప్ వెనుక అసలైన ఉద్దేశం, దీనిలో ఇంకెవరైనా పాత్రధారులు ఉన్నారేమో అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, అనకాపల్లి డిఎస్పీ బి.మోహనరావు, టౌన్ ఎస్‌హెచ్‌ఓ టీవీ.విజయ్ కుమార్, ఎస్సైలు సత్యనారాయణ, ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, సిసిఎస్ ఎస్ఐ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్లు అప్పలరాజు, స్వామి నాయుడు, అశోక్ కుమార్, ఐటీ కోర్ టీం, అనకాపల్లి టౌన్ స్టేషన్ సిబ్బందిని ఎస్పి ప్రశంసించారు. నగదు రివార్డు ప్రశంసా పత్రాలు అందజేశారు.

బుద్ధుని జీవితం నేటి తరానికి ఆదర్శం

ప్రజాశక్తి-అనకాపల్లి : బుద్ధుని జీవితం నేటి తరాలకు ఆదర్శం అని మాజీ మున్సిపల్ చైర్మన్ కొణతాల జగన్ అన్నారు. బుద్ధ జయంతి సందర్భంగా స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో బుద్ధుని జీవిత చరిత్రపై జిల్లాస్థాయిలో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలిచిన విజేతలకు కొణతాల జగన్ చేతులమీదుగా శనివారం బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ సంస్థ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, ఊడా నాగేశ్వరరావు, పిరాట్ల నరసింహమూర్తి, గ్రంధి కామేశ్వరరావు, పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఎపి రైతు సంఘం నాయకులు శనివారం ఫ్యాక్టరీ చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెరుకు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ 2024-25 సీజన్లో అనేక ఒడిదుడుకుల మధ్య నడవడంతో వచ్చే సీజన్లో ఫ్యాక్టరీ నడుస్తుందో లేదోనని రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. దీనికి బలం చేకూర్చే విధంగా ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా ఇప్పటి వరకు వచ్చే సీజన్‌కు సంబంధించి ఎటువంటి బహిరంగ ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. దీంతో చెరుకు పంట వేయడానికి రైతులు మక్కువ చూపలేదన్నారు. 2023-24 సీజన్లో సుమారు రూ.5 కోట్లు, 2024-25కు సంబంధించి సుమారు రూ.27 కోట్లు మొత్తం రూ.32 కోట్ల వరకు రైతులకు చెల్లించాల్సి వుందని తెలిపారు. కార్మికులకు కూడా 4 నెలల జీతాలు చెల్లించలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ఫ్యాక్టరీ భవిష్యత్‌పై యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే రైతులకు భరోసా ఇచ్చే విధంగా ఫ్యాక్టరీ వచ్చే సీజన్లో నడుపుతామని వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. చెరుకు కాటాలు, చెరకు పండించే గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ, దండోరా, మైక్ ప్రచారం లాంటి సాధనాల ద్వారా ప్రచారం చేసి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. ఫ్యాక్టరీ ఆధునీకరణకై స్థానిక రెండు నియోజకవర్గం ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చి గ్రాంటు రూపంలో నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. లేకపోతే సుమారు 11 మండలాల చెరుకు రైతులు, కార్మికులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, ఉపాధ్యక్షుల ఎస్‌వి.నాయుడు, నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, కంఠరెడ్డి నర్సింహులు, బోను దేముళ్ళు, శరగడం అప్పారావు, సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు


వైసిపి ఎంపిటిసిలతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం

వైసిపి ఎంపిటిసిలతో బూడి సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి వైస్ ఎంపీపీ-1 ఎన్నిక ఈ నెల 19న జరగనున్న నేపథ్యంలో శనివారం మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వైయస్‌ఆర్‌సిపి ఎంపిటీసీలతో సమావేశమయ్యారు. వైస్ ఎంపీపీ-1గా మామిడిపల్లి ఎంపిటీసీ పంచాద సింహాచలం నాయుడును పార్టీ తరపున అభ్యర్థిగా ప్రకటించారు. అనంతరం మండల వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు బూరె బాబురావు, ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి, జడ్పిటిసి కర్రి సత్యంలు ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎస్.మంజులవాణికి పార్టీ తరపున బీఫాంను అందజేశారు.


రైతుల వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

అన్నదాత సుఖీభవకు వివరాలు నమోదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం అమలుకు ఉత్తర్వులు జారీ చేయడంతో మండలంలో గల పలు గ్రామాల్లో రైతుల నుండి వ్యవసాయ శాఖ సిబ్బంది వివరాలు నమోదు చేస్తున్నారు. రైతులు సచివాలయాలలో తమ దరఖాస్తులు సమర్పిస్తున్నారు. వ్యవసాయ అధికారులు రైతుల ఖాతా నెంబర్‌తో, ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానం, నమోదు ప్రక్రియను చురుగ్గా చేపడుతున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉండడంతో ముమ్మరంగా నమోదు చేస్తున్నారు. రాజాం సచివాలయంలో 1200 ఖాతాలకు గాను ఇప్పటికి 650 ఖాతాలు నమోదు చేసినట్లు ఎంపీఈవో సంతోష్ తెలిపారు.

బిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ బిసి వెల్ఫేర్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా ఎన్నికలు శనివారం జరిగాయి. రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీరభద్రరావు అధ్యక్షతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూషణరావు, రాష్ట్ర సంఘం న్యాయ సలహాదారులు పి. రామచంద్రరావు సమక్షంలో వీటిని నిర్వహించారు. సంఘం అధ్యక్షునిగా కొణతాల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీవీవీ ప్రసాద్, కోశాధికారిగా కె. జోగినాయుడు, అసోసియేట్ అధ్యక్షునిగా బి. దేముడుబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పి.జగదీశ్, ఆర్.అప్పలరాజు, గౌరవ సలహాదారునిగా రిటైర్డ్ ఎమ్మార్వో పి వీరభద్రరావు ఎన్నికయ్యారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి గోపాల్, ఎంపీడీవో విజయలక్ష్మీ, తహసిల్దార్ లక్ష్మీ, ఇతర అధికారులు శనివారం పర్యటించారు. దిబ్బిడి గ్రామంలో పశువుల కోసం ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నీటి తొట్టిని పరిశీలించారు. పశువులకు తాగునీరు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. నేతవానిపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. బుచ్చయ్యపేట సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి విజయలక్ష్మీ, పిఆర్‌జెఇ, ప్రభు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


దిబ్బిడిలో పశువుల నీటి తొట్టిని పరిశీలిస్తున్న అధికారులు

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-యలమంచిలి

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా యలమంచిలి సర్కిల్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీటులు దాఖలు చేయాలని సూచించారు. తప్పించుకు తిరుగుతున్న నిందితుల్ని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఎన్‌బిడబ్ల్యులను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. చెడు నడత వ్యక్తులపై నిఘా పెంచాలని సూచించించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు అదుపు చేయడానికి సిసిటివి కెమెరాలను ప్రోత్సహించాలన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేసి నేరాలు అరికట్టే దిశగా పనిచేయాలని సూచించారు. రహదారులై ప్రమాదాలకు కారణాలు వివరిస్తూ నేషనల్ హైవేలపై వాహనాలు నిలపకుండా హెచ్చరించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులు శక్తి యాప్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోడు ప్రమాదాలు, సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు, ఫోక్సో ఏక్ట్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, ర్యాగింగ్ అంశాలపై తగిన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పరవాడ డిఎస్పీ వి.విష్ణుస్వరూప్, ట్రైనీ డిఎస్పీ శ్రీకృష్ణ చైతన్య, యలమంచిలి సిఐ ధనుంజరావు రూరల్ ఎస్సై ఉపేంద్ర, టౌన్ ఎస్సై సావిత్రి, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, మునగపాక ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

సైనిక కుటుంబాల సత్కార కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలో రక్షణదళాల్లో పని చేస్తున్న వారి కుటుంబాలను సత్కరించే కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ప్రారంభించారు. ఇందులో భాగంగా యలమంచిలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుండెల్నిండా దేశభక్తి నింపుకొని దేశరక్షణకోసం తమ బిడ్డల్ని రక్షణ దళంలో చేర్పిన తల్లిదండ్రులను గౌరవించడం మన కర్తవ్యమని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆరు విభాగాలుగా ఏర్పడి 283 మంది రక్షణదళ కుటుంబాల ఇళ్లను సందర్శించి, వారి ఇళ్లపై భారత జాతీయ పతాకం ఎగరవేసి, కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించే కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, కట్టా సత్యనారాయణ, నక్కా శివశంకర్, ఊటికూటి రమేష్‌నాయుడు, కొఠారు శ్రీనివాసరావు మాజీ సైనికోద్యోగులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కూటమి నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటిపారుదల కాలువల పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నియోజకవర్గంలో మరమ్మతులు గురైన ఇరిగేషన్ చానల్స్‌కు నిధులు మంజూరైన నేపథ్యంలో త్వరితగతిన పూర్తి చేయాలని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచించారు. స్థానిక గుండాల వీధి శంకరన్ సమావేశ మందిరంలో శనివారం అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు పాలకవర్గం సభ్యులు, జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ అధికారులతో జరిగిన సమావేశంలో కొణతాల మాట్లాడారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ కాలువలకు, గ్రోయిన్స్‌కు నిధులు కేటాయించకపోవడంతో రైతులకు ఎంతో అవసరమైన కాలువలు పూడుకుపోయి అక్రమాలకు గురయ్యాయని పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని రీ సర్వే చేసి కాలువలో సాగునీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లో వున్న ఓ అండ్ ఎం పనులు కింద డిసిల్టింగుకి నీటి సంఘాల ద్వారా కాలువలు చెరువులు అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. తక్షణమే వీటికి పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ పరిధిలో చేపట్టిన పనులు ఈ నెల ఆఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఆవఖండం, నీటిపారుదల కాలువలలో ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ చెప్పడం జరిగిందన్నారు. కాలవలు పూర్తిగా రీ సర్వే చేయాలని అధికారులు ఆదేశించారు. కాలువలు నీటి వనరులు అక్రమ గురైతే రాబోయే రోజుల్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటామన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈ నెల 19వ తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం జిల్లా కలెక్టర్ వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖలు చేపట్టవలసిన చర్యలు తెలియజేసారు. బందోబస్తు, పరీక్షా కేంద్రాలలో శానిటేషను, మంచినీరు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, పరీక్షా జవాబు పత్రాలను పంపించుటకు పోస్టల్ సిబ్బంది సహకరించాలని, పరీక్షల సమయంలో కరెంటు కోతలు ఉండకూడదని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేవిధంగా బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు గంటముందుగానే చేరుకొనేవిధంగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. రవాణా కారణంగా ఏ ఒక్కవిద్యార్థి పరీక్షరాయలేని పరిస్థితి ఉండకూడదని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు పరీక్షల వివరాలు తెలియజేస్తూ ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు జరుగు పరీక్షలకు 2481 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1268 మంది ప్రైవేటు విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. వారికి జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. వీటితో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు 357 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 994 మంది పరీక్షతప్పిన విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 19 నుంచి 24వ తేదీ వరకు, ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు 26 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణ సంబంధిత రెవిన్యూ, పోలీసు, ఆర్‌టిసి, ట్రెజరీ, పోస్టలు, విద్యుత్, ఆరోగ్య శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పలు ప్రాంతాల్లో 'బీట్ ద హీట్'



పరవాడలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, ఎంపీడీవో

ప్రజాశక్తి- సబ్బవరం

వేసవి తాపానికి గురికాకుండా ప్రజలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలక్టర్ విజయకృష్ణన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఈ నెలలో బీట్ ది హీట్ నినాదంతో నిర్వహించినట్లు చెప్పారు. మండలంలోని బాటజంగాలపాలెం గ్రామంలో కలెక్టరు ప్రయాణికులు, బాటసారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి షెల్టరును ప్రారంభించారు. అనంతరం వైద్యశిబిరం పరిశీలించారు. మండలంలో మాతృ మరణాలు ఎక్కువగా ఉన్నాయని, హైరిస్క్ కేసులను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామంలోని కేన్సర్ టెస్టింగు సెంటరులో ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రాజకుమార్, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, డీపివో శిరీష రాణి, జిల్లా ప్రత్యేక అధికారి రమామణి, ఎంపీడీవో పద్మజ, తహశీల్దారు చిన్నకృష్ణ, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యాన జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శ్రమదానం చేశారు. కార్యాలయ ప్రాంగణం, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, రికార్డు గదులు శుభ్రపరిచారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఓ ఎ.రామ్ కుమార్, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, లక్ష్మీ, గఫూర్, రమేష్, రామకృష్ణారావు, మన్మధరావు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో చలివేంద్రాన్ని డిఆర్ఓ సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం, మేజిస్ట్రియల్ సెక్షన్ సూపరింటెండెంట్లు ఎస్‌విఎస్. నాయుడు, డి.రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : జివిఎంసిసి 84వ వార్డు సాలాపువానిపాలెంలో టిడిపి ఇంచార్జ్ మాదంశెట్టి నీలబాబు ఆధ్వర్యాన పరిసరాలు పరిశుభ్రత నిర్వహించారు. సాలాపు మోహన్ సాలాపు నాగరాజు సాలాపు రమణ సాలాపు సుమన్ పాల్గొన్నారు. స్థానిక శివ ఐటిఐ ఆధ్వర్యాన చలివేంద్రం ఏర్పాటు చేశారు., మొక్కల నాటారు. ఏఎంఏఎల్ కళాశాల రిటైర్డ్ హెచ్ఓడి నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో పీహెచ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. కమ్యూనిటీ సోక్ పిట్‌కు శంకుస్థాపన చేశారు. పక్షులకు నీరు, ఆహారం అందించడానికి ప్రత్యేకంగా తయారు చేసిన పరికరాన్ని ప్రారంభించారు. పక్షులకు నీళ్లు పెట్టుందుకు గ్రామంలో 20 మందికి మట్టి పాత్రలు పంపిణీ చేశారు. గ్రామ పారిశుధ్య సిబ్బందిని సత్కరించి, బియ్యం, కిరాణా సామాగ్రి అందించారు. రామాలయం వద్ద చలివేంద్రం ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ దేవి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఎరుకుటి అప్పలరాజు, వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, ఎంపీడీవో సాంబశివరావు, తహశీల్దార్ రమేష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేటలో మజ్జిగ పంపిణీ చేశారు. అచ్యుతాపురం, రామన్నపాలెం, వెదురువాడ గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.విస్తరణ అధికారి చందక శ్రీరాములనాయుడు, గ్రామ సర్పంచులు కె విమలా నాయుడు, డి.నాయుడుబాబు, ఎస్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఆరిలోవలో..

చోడవరం : స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్లో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యాన పచ్చదనం పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో జి ఆంజనేయులు, ఇపిఇఆర్‌డి డి.మహేష్, పంచాయతీ ఈవో నారాయణరావు, ఎంపీపీ గాడి కాసులమ్మ, టిడిపి మండల అధ్యక్షులు బొడ్డేడ నాగ గంగాధర్ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని రావాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, ఎంపీడీవో బి.రమేష్ నాయుడు ఆధ్వర్యాన పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మజ్జి చిట్టెమ్మ ఇంటి వద్ద కిచెన్ కంపోస్ట్ పిట్ కొరకు శంకుస్థాపన చేశారు. బాపడు చెరువులో ఉపాధి కూలీలకు మజ్జిగ పాకెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామచంద్రరావు, ఏపీఎం రంగారావు, పంచాయతీ కార్యదర్శి, జె అనూరాధ, ఎన్ఆర్ఈజీఎస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణను శుభ్రపరిచారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి ఎస్.మంజులవాణి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు, సర్పంచి సబ్బవరపు పెంటమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దినోత్సవ కార్యక్రమంలో 28వ వార్డ్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పాల్గొన్నారు. ఐదు రోడ్ జంక్షన్ లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ పై కౌన్సిలర్ పద్మావతి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అక్కడ నుండి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ , మున్సిపల్ చైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, అధికారులు పాల్గొన్నారు.

కోటవురట్ల: పలు గ్రామాల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. తహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు. బికేపల్లి గ్రామంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, మండల టిడిపి అధ్యక్షులు లింగన్ననాయుడు, పిఒపిఆర్డి రఘురాం పాల్గొన్నారు, వెంకటాపురం గ్రామంలో టిడిపి యువజన నాయకులు తిరుమల రావు అధికారులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జివిఎంసి "బీట్ ద హీట్" నినాదంతో విశాఖ నగరంలో వేసవి ఉపశమనానికి ప్రత్యామ్నాయ చర్యలు దిశగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో నగర ప్రజలు భాగస్వామ్యం కావాలని, మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ముందుగా మేయర్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, కలెక్టర్ ఎమ్ఎన్.హరేంధిరప్రసాద్‌తో కలిసి శివాజీ పార్క్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాద్‌రాజు, పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా సాగాయి. అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా భాగస్వామ్యమయ్యారు. ఆయా కార్యాలయాల పరిధిలో పచ్చదనం పెంపొందేలా మొక్కలు నాటారు. వాటికి నీరు పోసి సంరక్షణ కోసం కంచెలు వేశారు. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేలా సాధారణ పౌరులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. బీట్ ద హీట్ అనే నినాదాలు చేస్తూ కొన్ని కార్యాలయాల అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు చేపట్టారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని పార్కులో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్ తో కలిసి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మొక్కలు నాటారు. గార్డెన్ లోని చెత్తను తొలగించారు. సామూహిక ప్రతిజ్ఞ చేశారు.

కెజిహెచ్‌లో ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. సూపరింటెండెంట్ శివానంద పాల్గొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ పరిధిలో మజ్జిగ పంపిణీచేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్‌వి.రమణ, మల్లికార్జున, నారాయణరావు, శ్రీనివాసరావు, కిశోర్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : వడదెబ్బకు గురిగాకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక సిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణికుమార్ అన్నారు. శనివారం వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. "బీట్ ద హీట్" పేరిట ఆసుపత్రి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

మండలంలోని సింగనబంద పంచాయితీ, కృష్ణంరాజుపేట గ్రామంలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ జివి నారాయణ, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటారు.

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి ఆధ్వర్యంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఆనందపురం: వెల్లంకి వైఎస్సార్ కాలనీలో మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ సీహెచ్.సత్తిబాబు అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్‌లో భాగంగా బీట్ ద హీట్‌పై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. వడదెబ్బను ఎదుర్కోవడం, పశుపక్ష్యాదులకు వేసవిలో దాహార్తితీర్చడంపై అవగాహన కల్పించారు. మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు ఒఆర్ఎస్ ప్యాకెట్లుపంపిణీ చేశారు.బొడ్డపాలెం బస్‌స్టాప్ వద్ద గ్రీన్ హౌస్ ప్రారంభించారు. సంపద తయారీ కేంద్రం పరిశీలించారు.డిపిఒ ఎంపిఎ శ్రీనివాసరావు, ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, బి. సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి శ్రీ రామ్ మూర్తి, ,సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఎంపిటిసి పడాల అప్పలనాయుడు , చెన్న నర్సింగరావు, చెన్న అప్పలరాజు పట్నాయకుని ప్రసాదరావు పాల్గొన్నారు

వేపగుంట : 95వ వార్డు గొల్లవిల్లివానిపాలెంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ్‌లో భాగంగా వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆధ్వర్యంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్మికులతో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఊట పెంటారావు, మంగమ్మ, సూరిబాబు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు

ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బాలల వేసవి శిక్షణ శిబిరంలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలోని బీరువాలను, పుస్తకాలను శుభ్రపరిచారు. తొలుత స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై. అనసూయదేవి చేయించారు. అందరికీ పండ్ల రసాలను మజ్జి సోమేష్ అందజేశారు.° గ్రంథాలయాధికారి వి. అజయ్‌కుమార్, ద్వారపూడి శ్రీనివాస మనోహర్‌పాల్గొన్నారు.

ఆరిలోవ : విమ్స్‌లో రోగులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పంపిణీ చేసారు 12వ వార్డు నెహ్రూనగర్‌లో వార్డు శానటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. వేసవితాపం నుంచి ఉపశమనానికి మజ్జిగ, ఒఆర్ఎస్ పంపిణీ చేశారు. టిడిపి వార్డు అధ్యక్షులు గాడి సత్యం, సన్యాసిరావు, కొత్తల గోపాల్, పోతిన భరత్ పాల్గొన్నారు. 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. శానటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

ఉక్కునగరం: 87వ వార్డు గణేష్‌నగర్‌లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలోటిడిపి రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం (జగన్) పాల్గొన్నారు. వార్డ్ అధ్యక్షులు రాజన్ రాజు, విజయరామరాజు, ప్రగడ దానయ్య, బొడ్డా సన్యాసి, సానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు, గణేష్ నగర్, తిరుమల నగర్ అసోసియేషన్ సభ్యులు, పాల్గొన్నారు.



నర్సీపట్నంలో..



చీడికాడలో కథలు చెపుతున్న జోగేశ్వరి

కొనసాగిన వేసవి శిబిరాలు

ప్రజాశక్తి - చీడికాడ:వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో భాగంగా చీడికాడ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎమ్మెస్సార్ జోగేశ్వరి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నీతి కథలు వివరించారు. విద్యార్థులకు ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శాఖ గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో చిన్నారులకు బొమ్మల పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



బొమ్మలను చూపుతున్న విద్యార్థులు

ఎంపిడిఒగా సాయి సుధ

ప్రజాశక్తి -కోటవురట్ల: మాకవరపాలెం ఎంపీడీవో గా సాయి సుధా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గిరిజన కార్పొరేషన్ సంస్థలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకాలం ఇంచార్జి ఎంపీడీవో గా ఉన్న సీతామహాలక్ష్మి ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి, టిడిపి నాయకులు, పలు శాఖలకు చెందిన అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.





కౌన్సెలింగ్ చేస్తున్న డిఎస్‌పి

నేరాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రూరల్ సర్కిల్ పరిధిలో గల పాత నేరస్థులకు శనివారం డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. గంజాయి అక్రమ రవాణాకు సహకరించడం, ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడడం చేసినట్లయితే నేరస్తులను గుర్తించి వారి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పీడీ యాక్ట్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. నేరాలకు దూరంగా ఉండి, చట్టాన్ని గౌరవిస్తూ సమాజంలో మంచి పౌరులుగా మారాలని సూచించారు. స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సర్కిల్ సిఐ రేవతమ్మ, నర్సీపట్నం రూరల్ ఎస్సైలు పాల్గొన్నారు.

ఉక్కు పోరాటంపై ప్రతీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అసమ్మతి, వ్యతిరేక అభిప్రాయాలు, భావాల వ్యక్తీకరణ హక్కులతో నిర్మాణమైన ప్రజాస్వామిక విలువలపై దాడి పెరుగుతోంది. విలువలు, హక్కులపై విశ్వాసం, గౌరవం, నమ్మకంలేని పాలకవర్గాలు శక్తివంతంగా మారితే వచ్చే ప్రమాదం ఎంతభయంకరంగా ఉంటుందో విలువల కోసం పరితపించే వారికి తప్ప ఇతరులకు సరిగా అర్థంకాదు. బోధపడేలోపు ఓ బాధితుడై సహాయం కోసం నిస్సహాయతతో ఎదురుచూడాల్సినరోజు ప్రతి ఒక్కరికీ రాకతప్పదు. ఇది ఏ రూపంలో, ఎప్పుడు ఏ వికృత చేష్టలతో పరాకాష్టకు చేరుకొని ప్రజలపై విన్యాసం చేస్తుందో ఆ సమాజపు సామాజిక మౌనం, ప్రతిస్పందనలను బట్టి ఆధారపడివుంటుంది. తనకు జరిగిన, జరుగుతున్న అన్యాయం, అధర్మంపై మౌనం వహిస్తున్నంతకాలం మనిషిని అణచివేయడం, భయపెట్టడం, బాధపెట్టడం, చివరకు తామనుకున్న కార్యం నెరవేర్చుకోవడం పాలకపక్షానికి సులభమవుతోంది. ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిలువునా బలితీయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలు ఆగడంలేదు.

ప్రతి మనిషీ తన అభిప్రాయాన్ని, భావాన్ని ప్రకటించుకొనే, చెప్పుకొనే భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించింది. ఆ రాజ్యాంగంపై విలువలేని పాలకులు స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసి ప్రయివేటు వ్యక్తులకు గుత్తగా అప్పగించడానికి అడ్డుపడుతున్న వారిని భయభ్రాంతులకు గురిజేయడానికి సిద్ధపడ్డాయి. నిర్బంధ చర్యలకు యాజమాన్యాన్ని పాలకవర్గాలు ఉసిగొల్పుతున్నాయి. అప్రతిహతంగా దూసుకువెళ్తున్న స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి ఆటంకాలు సృష్టించి, అసమర్థంగా నడుస్తుందని ప్రచారం చేసి పరాయివాడి చేతిలో పెట్టడానికి పన్నిన కుట్రలు, కుత్సితాలు పోరాటాలకు నెలవైన ఈ నేలపై సాగకపోవడంతో భయానక వాతావరణం సృష్టిస్తోంది. ప్లాంట్‌లో నలుగురు కలిసి మాట్లాడుకొనే అవకాశంలేకుండా చేసి, ప్లాంట్ అమ్మక ప్రక్రియ వేగవంతం చేసేందుకు కార్మిక సంఘాల నాయకులకు షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు చేసింది. ఈ తాటాకు చప్పుళ్లలకు భయపడని కార్మికులు ఈ నెల 20న విశాఖ స్టీల్‌ప్లాంట్ సమ్మెకు వెళ్లబోతున్నారు. ఎన్నో నెలలుగా 25, 50 శాతానికి మించి కార్మికులకు జీతం ఇవ్వకుండా వారి ఉసురుపోసుకుంటోంది. దాదాపు 4వేల మంది కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించింది. కడుపు మండిపోతున్న కార్మికులకు తాడోపేడో తేల్చుకొనే అనివార్య పరిస్థితి ఏర్పడింది. నిరవధిక సమ్మెకు కాంట్రాక్టు కార్మికులు సిద్ధపడగా, పర్మినెంట్ కార్మికులు ఒక రోజు సమ్మె చేయనున్నారు.



ప్రభుత్వరంగ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వదిలించుకొని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను నెత్తిన పెట్టుకొని మోసే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. తానడిగితే ప్రధాని మోడీ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేస్తారని గొప్పలు చెప్పిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు పదవి చేతికొచ్చాక నాలుక మడతపడి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయమే మర్చిపోయారు. అప్రజాస్వామిక సస్పెన్షన్లు, షోకాజ్ నోటీసులపై కూటమి నాయకులు నోరు విప్పడంలేదు. కుట్రదారుల మాటలు పట్టుకొని వేలాడకుండా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో కార్మికులకు తోడుగా ప్రజలు సమూహంగా కదలి కలిసి పోరాడాలి. తెలుగుజాతికి వన్నె తెచ్చిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకొనేందుకు పోరాటం పతాకస్థాయికి తీసుకెళ్లాలి.



వినతిపత్రం ఇస్తున్న డ్రైవర్లు

తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్ల జీతభత్యాలు పెంచాలని ఆ యూనియన్ ప్రతినిధులు శనివారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ రాజాన వీర సూర్యచంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు పీ.కృష్ణ మాట్లాడుతూ 2015లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాతా శిశు మరణాలను తగ్గించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవం అయిన తర్వాత తల్లి బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చుటకు తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకంలో భాగంగా వేతనం రూ.7193 నిర్ణయించి డ్రైవర్లుగా తమ్మల్ని విధుల్లోకి తీసుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 550 మంది ఉద్యోగులు ప్రభుత్వ సేవలను అందిస్తున్నప్పటికీ ఇప్పటివరకు తమకు కనీస జీతభత్యాలు పెంచలేదన్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇస్తున్న జీతాలు కూడా సకాలంలో చెల్లించని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. జనసేన ఇంచార్జ్ సూర్యచంద్ర మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్లు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న సిఐ

నింజాస్ క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఈ నెల 12 నుండి 14 వరకూ కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి వుషు టోర్నమెంట్ లో నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు 13 మెడల్స్ సాధించారు. ఒక ప్రత్యేక కార్యక్రమంలో వీరిని నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ రేవతమ్మ, నింజాస్ అకాడమీ ఛైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు. అక్షయ రాణి, లక్ష్మి పార్వతి సీనియర్ విమెన్ విభాగంలోనూ, శ్రీరామ్, నిహాల్ సబ్ జూనియర్ విభాగంలోనూ, ప్రణీత్ సబ్ జూనియర్ విభాగంలోనూ, దివాకర్ మెన్ సీనియర్ విభాగంలోనూ గోల్డ్ మెడల్స్ సాధించారు. జి సాయి ఉమెన్ సీనియర్ విభాగంలోనూ, యు రవి కుమార్ సీనియర్ మెన్ విభాగంలోనూ, సిల్వర్ మెడల్స్ సాధించారు. సబ్ జూనియర్ బాయ్స్ విభాగంలో టి జగదీష్ వై సాత్విక్ ఎం దుర్గా ప్రసాద్, ఎం హర్ష, ఎం సాయి, సందీప్ కె విజయ్ కుమార్ బ్రాంచ్ మెడల్స్ సాదించారు. వీరికి ఎన్ఐ ఎస్ కోచ్ ప్రియాంక శిక్షణ ఇచ్చారు.

భూ సమస్యలపై సమావేశం



కోటవురట్లలో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి- కోటవురట్ల: భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన మండల కోఆర్డినేషన్ కమిటీ శనివారం తహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో పలు గ్రామాల సమస్యలపై రైతులు హాజరయ్యారు. జగ్గంపేటలో అన్నదమ్ముల వివాదాన్ని పరిష్కరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అదే విధంగా పీకే పల్లి, రాజుపేట, తంగేడు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏఎస్ఐ గంగరాజు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో గుడ్డిప రెవెన్యూ గ్రామ పరిధిలో కొంతమంది తమ డి పట్టా భూమిని ఆక్రమిస్తున్నారంటూ దేవుడమ్మ, లక్ష్మి ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలకు నోటీసు పంపడం జరిగిందని తహసిల్దార్ వెంకటరమన తెలిపారు. ఫిర్యాదుదారులు మాత్రమే హాజరయ్యారని, ప్రతివాదులు మాత్రం హాజరు కాలేదన్నారు. ప్రతివాదులు సమస్యలు చెప్పుకోవడానికి రెండు దఫాలు అవకాశం కల్పించామని, అయినప్పటికీ హాజరు కాలేదన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో శనివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దార్ బి. వెంకటరమణ మాట్లాడుతూ, డిఫారం భూమిని అమ్మడం, కొనడం, చేయకూడదని చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, ఏఎస్ఐ అప్పారావు, వీఆర్వో బాలాజీ పలువురు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న నాయకులు

లింగన్న నాయుడుకు అభినందనలు

ప్రజాశక్తి-కోటవురట్ల: టిడిపి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన లింగన్న నాయుడుకి టిడిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు, దీంతో లింగన్న నాయుడు ఇంటి వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా లింగన్న నాయుడు మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి, మండల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులకు పారదర్శకంగా అదే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు, ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలను కూటమి నాయకులు అభినందనలు నిర్వహించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న సెక్రటరీ

ప్రజాశక్తి-రావికమతం: ఇంటి పరిసరాలతో పాటు,గ్రామ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ సర్పంచ్ దాసరి సూర్య కుమారి తెలిపారు. మండలంలో కవగుంట గ్రామంలో శనివారం డ్రై డే కార్యక్రమాన్ని సర్పంచు దాసరి సూర్య కుమారి, పంచాయతీ కార్యదర్శి రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నెలలో ప్రతి మూడవ శనివారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ చేపడుతున్నామన్నారు. గ్రామ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉన్నప్పుడు ఎటువంటి వ్యాధులు దరి చేరవన్నారు.ఇంటితో పాటు గ్రామ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో పొన్న వోలు పంచాయతీ శివారు గదబపాలెం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురై గత 22 రోజుల నుంచి సరఫరా నిలిచి పోయిందని ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి గ్రామస్తులకు విద్యుత్ సరఫరా చేశారు. గత 22 రోజులుగా అంధకారంలో ఉన్న గ్రామంలో ఒక్కసారిగా వెలుగులు నింపడంతో ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

కెజిహెచ్‌లో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తాం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. 40 పడకల క్యాజువాలిటీ డిపార్ట్‌మెంట్‌లో సెంట్రల్ ఎయిర్ కండిషన్ సిస్టమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌కు అనుసంధానిస్తూ పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటు ప్రభుత్వంతో, అటు సిఎస్ఆర్ నిధులతో కెజిహెచ్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. నిరంతరం రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -అనంతగిరి: క్రికెట్ విజేతలకు మొదటి రెండవ బహుమతులు స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు, ఎంపీపీ శెట్టి .నీలవేణి చేతుల మీదగా అందజేశారు. మండలంలోని ఎగువ శోభ పంచాయతీ పరిధి దిగుశోభ పొర్నపాదొర్ గ్రామంలో సొంటరి. సుబ్బారావు, మట్టం శ్యామ్ లు క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేశారు. ఈ ఆటలో మొదటి బహుమతి క్యాపిటల్ ఎస్ సుబ్బారావు టీంకు మొదటి బహుమతి 20000, రెండవ బహుమతి జన్ని. విజయ్ టీంకి 10000 అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ క్రిడా పోటీలలో యువత రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాంగి .దయాకర్, జన్ని. గుండు రాజు తదితరులు పాల్గొన్నారు.



బహుమతుల అందజేస్తున్న గంగరాజు